వికారాబాద్, శుక్రవారం 6 అక్టోబర్ 2023



## నాలుగు నియోజకవర్గాల్లోనూ గెలుపు బీఆర్ఎస్‌దే



రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే భారీ మెజార్టీతో గెలుస్తారు. ఇప్పటికే వికారాబాద్ మున్సిపాలిటీలో రూ.173 కోట్లతో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ.96 కోట్లతో కొత్త రైల్వే ఓవర్‌బ్రిడ్జి, రూ.60 కోట్లతో మున్సిపల్ అభివృద్ధి తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం వికారాబాద్‌ను జిల్లాగా మార్చడంతోపాటు కొత్త మండలాలు, గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. అదేవిధంగా తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి వాటి పురోగతికి విశేషంగా కృషి చేస్తున్నది. అనంతగిరిలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉన్నది. కాంగ్రెస్ నాయకుల మాటలను వికారాబాద్ ప్రాంత ప్రజలు నమ్మరు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో త్వరలోనే వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, చేవెళ్ల ప్రాంతాలకు సాగునీరు అందుతుంది.

**-డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి**



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పక్కన మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్





బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు



ప్రభుత్వ పథకాలను పాటల రూపంలో వివరిస్తున్న కళాకారులు



తరలివస్తున్న మహిళలు



*ఆనంద్‌ను గెలిపించి కానుక ఇస్తే..*

*రైల్వే బ్రిడ్జి పూర్తి చేసి మరు కానుకిస్తాం*

*మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టండి*

*రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి తారక రామారావు*

# వికారాబాద్‌లో.. ఐటీ హబ్..

*వికారాబాద్ మున్సిపాలిటీలో రూ.173 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు*

*పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు*

వికారాబాద్, అక్టోబర్ 5(నమస్తే తెలంగాణ): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 30 వేల మెజార్టీతో వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్‌ను గెలిపించాలని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ కోరారు. గురువారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రూ.173 కోట్లతో గిరిజన భవన్, స్కిల్ డెవలమెంట్ సెంటర్, రైల్వేఓవర్ బ్రిడ్జి, రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల పైలాన్‌ను మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, పైలట్ రోహిత్ రెడ్డి, కాలె యాద య్య, మహేశ్‌రెడ్డిలతో కలిసి మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ లో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గ అభ్యర్థి ఆనంద్‌ను గెలిపించి మాకు కానుకగా ఇస్తే, 12-18 నెలల్లో వికారాబాద్ పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిని పూర్తి చేసి మీకు కానుకగా ఇస్తామన్నారు. అదేవిధంగా డిగ్రీ కాలేజీ కోసం యుద్ధాలు చేసిన వికారాబాద్‌కు ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని.. దశాబ్దాల కల అయిన వికారాబాద్ జిల్లాను ఆయనే ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.

ఒకప్పుడు హైదరాబాద్‌లో ఉన్న కలెక్టరేట్‌కు వెళ్లి రావాలంటే కారు అద్దెకు వెళ్లాల్సి వచ్చేదని.. కానీ సీఎం కేసీఆర్ వికారాబాద్‌లోనే కలెక్టరేట్‌ను ఏర్పాటు చేసి పాలనను మీ దగ్గరకు తీసుకొచ్చారని మంత్రి కేటీఆర్ ప్రజలను ఉద్దేశించి పేర్కొన్నారు. మర్పల్లి-మోమిన్‌పేట రోడ్డుకు రూ.12 కోట్లు మంజూరు చేస్తామన్నారు.

అదేవిధంగా వికారాబాద్‌కు ఎన్నికల అనంతరం ఐటీ హబ్‌ను మంజూరు చేసి హామీని నెరవేరుస్తామన్నారు. మీ హయాంలో వికారాబాద్‌కు ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఎందుకు తీసుకురాలేదని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌ను ప్రశ్నించారు. వికారాబాద్ ప్రజలు చాలా చురుకైన వారు.. చదువుకున్న, ఎప్పటికీ అందుబాటులో ఉండే స్థానికుడైన ఆనంద్‌ను కోరుకుంటారు కానీ గెలిచిన తర్వాత హైదరాబాద్‌లో ఉండే వారిని కోరుకుంటారా అని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా వికారాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆనంద్‌ను బరిలో నిలపడం జరిగింది.. కానీ ఇప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో ఇంకా తేలలేదు.. బీజేపీ అభ్యర్థి అనుకున్న ఆయన ఈ మధ్యే జహీరాబాద్‌కు పోయిండని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికలు రావడంతోనే కాంగ్రెస్, బీజేపీల నాయకులు గంగిరెద్దుల్లా తిరుగుతూ ఏం అడిగితే అది ఇస్తామని అంటున్నారు. అనంతగిరికి చంద్రయాన్‌ను కూడా తీసుకొస్తామని హామీలిచ్చినా ఎవరూ ఆగం కావద్దని మంత్రి కేటీఆర్ సూచించారు. ఉప ఎన్నికలు వ్యక్తుల మధ్య పోటీ అయితే, సార్వత్రిక ఎన్నికల్లో పోటీ పార్టీల మధ్య ఉంటుందని.. ఎవరూ సీఎం అయితే పేదల బతుకులు మారుతాయో చూస్తారన్నారు. అందువల్ల సబ్బండ వర్ణాలకు అండగా ఉన్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి.. భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులకు మంత్రి సూచించారు.

### దమ్ముంటే పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వాలి



ప్రధాని మోదీకి దమ్ముంటే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి. ప్రధాని ఇక్కడికొచ్చి పోటీ చేసినా నేనే చేవెళ్ల బరిలో ఉంటా. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేనన్ని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి. రైతుబంధుతోపాటు పలు పథకాలను మోదీ ప్రభుత్వం పేరు మార్చి కాపీ కొడుతున్నది. దమ్ముంటే దళితబంధు, డబుల్ బెడ్రూం ఇండ్లు, రైతుబీమా వంటి పలు పథకాలను దేశ మంతా అమలు చేయాలి. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యా రెంటీలను ప్రజలు నమ్మడంలేదు. సిక్సు లు కొడితే మ్యాచ్ గెలిచినట్లు కాదు..విన్నింగ్ షాట్ కొడితేనే మ్యాచ్ గెలిచినట్లు. తెలంగాణ అభివృద్ధి దేశానికే రోల్ మాడల్‌గా నిలిచింది. కృష్ణా జలాలను తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే. వికారాబాద్‌లో రూ.180 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించడం సంతోషంగా ఉంది. ప్రధాని మోదీ, రేవంత్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారు. మరోసారి కారు గుర్తుకు ప్రజలు ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి కూడా సీఎంగా గెలిపించాలి. **- గడ్డం రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ**

### కోట్లాది రూపాయలతో నియోజకవర్గాభివృద్ధి



కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రచారం ఉన్న ప్రసాద్‌కుమార్ గ్రామాల్లో తిరుగుతున్నాడు.. కానీ త్వరలోనే వికారాబాద్ చోడో అనేలా అతడికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పడం ఖాయం. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ఓ సామాజిక వర్గానికి చెందిన వారిపై కేసులు పెట్టించి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నాడు. గెలిచిన నాటి నుంచే అభివృద్ధి-అందుబాటులో అనే నినాదంతో ప్రజల మధ్యే ఉంటున్నా.. అతడిలా గెలిచిన తర్వాత హైదరాబాద్‌లో ఉండలేదు. ప్రసాద్‌కుమార్ మం త్రిగా ఉన్నప్పుడు పలు అక్రమాలకు పాల్పడ్డారు. గత ఉమ్మడి పాలకుల నిర్లక్ష్యంతో వికారాబాద్ ప్రాంతం అభివృద్ధి లో 50 ఏండ్లు వెనక్కి వెళ్లింది. చార్మినార్ జోన్‌లో కలపడంతో వికారాబాద్ జిల్లాకు చెందిన 48 మంది ఎస్ఐ ఉద్యోగాలను సాధించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన మొదటి ఏడాదిలో సర్పంచ్, ఎంపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్, సొసైటీ ఎన్నికలు జరుగగా.. మరో రెండేండ్లు కరోనా వైరస్ కారణంగా కరిగిపోయాయి. మిగిలిన రెండేండ్లలో నియోజకవర్గాభివృద్ధికి ఎంతో కృషి చేశా. వికారాబాద్ జిల్లాకు రూ.235 కోట్లతో మెడిక ల్ కళాశాల, రూ.28.34 కోట్లతో ఆయుష్ దవాఖానను అనంతగిరికి తీసుకొచ్చా. బ్రిడ్జి నిర్మాణానికి రూ.96 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. వికారాబాద్‌కు అవు ట్ రింగ్‌రోడ్‌తోపాటు అనంతగిరి టూరిజం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్‌ను ఇప్పటికే కోరడం జరిగింది. అనంతపద్మనాభస్వామి ఆలయ అభివృద్ధి, మరో రెండు రైల్వే బ్రిడ్జిలు అవసరం అవుతాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లా. **- వికారాబాద్ ఎమ్మెల్యే, డాక్టర్ మెతుకు ఆనంద్**

## రామన్న సభ సక్సెస్.. క్యాడర్‌లో జోష్

వికారాబాద్, అక్టోబర్ 5: వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన మంత్రి కేటీఆర్ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూరు, వికారాబాద్, మోమిన్‌పేట, బంట్వారం, కోట్‌పల్లి, మర్పల్లి మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బీఆర్ఎస్ జెండాలతో భారీగా తరలివచ్చారు. వికారాబాద్ పట్టణంలోని బీజేఆర్‌చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తాల మీదుగా బ్లాక్‌గ్రౌండ్ వరకు డప్పుచప్పుళ్లు, డ్యాన్సులు చేసుకుంటూ జోష్‌గాపుల్‌గా వచ్చారు. వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు, ఎమ్మార్పీ చౌరస్తా నుంచి బీజేఆర్ చౌరస్తాల మీదుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్, ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలు ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేశారు. మంత్రి కేటీఆర్ రాకతో ప్రజల్లో జోష్ వచ్చింది. పలువురు నాయకులు, అభిమానులు కేటీఆర్‌ను చూసిన ఆనందంలో డ్యాన్సులు చేశారు. కళాకారులు బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని పాటల రూపంలో పాడి వినిపించారు. ఈ సభకు దాదాపుగా 10 వేలకు పైగా ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు తరలొచ్చారు. సభకు వచ్చిన వారికి మంచినీరు, భోజన సదుపాయాలు కల్పించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన కార్యకర్తల వాహనాల పార్కింగ్ స్థలంలో ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నారు.

### మంత్రికి ఘన స్వాగతం

వికారాబాద్ మున్సిపల్ పరిధిలో రూ.173 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మంత్రి కేటీఆర్ షాద్‌నగర్‌లో సభను ముగించుకుని హెలికాప్టర్ ద్వారా వికారాబాద్ పట్టణంలోని జిల్లా ఎస్పీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో సాయంత్రం 4గంటలకు దిగారు. ఆయనతోపాటు మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వచ్చారు. వికారాబాద్ చేరుకున్న మంత్రి కేటీఆర్‌కు వికారాబాద్, పరిగి, చేవెళ్ల ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, యాదయ్యలు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. ప్రారంభోత్సవాల అనంతరం వికారాబాద్ రైల్వే బ్రిడ్జి పై నుంచి వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభకు వెళ్లారు. మంత్రి కేటీఆర్ ప్రసంగానికి ప్రజల్లో మంచి స్పందన వచ్చింది. మహిళలు, పెద్దలు, యువత అంతా రామన్న, కేటీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

### పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

వికారాబాద్ మున్సిపల్ పరిధిలో మంత్రి కేటీఆర్ పర్యటించి రూ.173కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, రోహిత్‌రెడ్డి, యాదయ్యలతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వికారాబాద్‌లో రూ.96 కోట్లతో నిర్మించనున్న రైల్వేవంతెన, రూ.7.20కోట్లతో చేపట్టనున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.1.10 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ గిరిజన భవన ప్రారంభం, రూ.కోటితో నిర్మించనున్న ప్రభుత్వ గిరిజన కళాశాల, బాలికల వసతి గృహాలకు శంకుస్థాపనలు చేశారు. అలాగే రూ.1.54కోట్లతో కేజీబీవీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన అదనపు తరగతిగదులు, ల్యాబ్, రూ. 1.54 కోట్లతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.48.69 లక్షలతో సఖీ సెం టర్‌ను ప్రారంభించారు. రామయ్యగూడ, ఆలంపల్లి గ్రామాల వైకుంఠధామాల నిర్మాణానికి రూ.2 కోట్లు, వికారాబాద్ పట్టణంలోని పార్కుల సుందరీకరణ, అభివృద్ధి పనులకు ఐదు కోట్లు, రూ.25 కోట్లతో సీసీ రో డ్లు, మురికి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బహిరంగ సభకు తరలివస్తున్న వికారాబాద్‌లోని 32వ వార్డుకు చెందిన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు



సభకు భారీగా తరలివస్తున్న ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు



డ్యాన్సులు చేస్తూ..



చేతులు ఊపుతూ అభిమానాన్ని చాటుతున్న అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు